రేపటినుంచి సంక్రాంతి బస్సులు

- మొత్తం 11 వేల సర్వీసులు నడిపేలా చర్యలు
- అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు
- రవాణాశాఖ హెచ్చరిక

అడయార్, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు చెన్నై నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు రాష్ట్ర రవాణా శాఖ నడపనుంది. రోజువారీగా నడిపే 2,100 బస్సులతో కలుపుకుని మొత్తం 4,706 బస్సులను ప్రతి రోజూ నడిపేలా చర్యలు తీసుకుంది. మొత్తం మూడు రోజుల పాటు 11,006 బస్సులు నడుపుతారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చెన్నై నగరానికి వచ్చే ప్రయాణికుల కోసం 8,478 బస్సులను నడపనున్నట్టు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ బస్సులు చెన్నైలోని ప్రధాన బస్టాండ్లు అయిన కోయంబేడు, మాధవరం, కిళంబాక్కంలతో పాటు కేకే నగర్, తాంబరం, పూందమల్లి నుంచి బయలుదేరి వెళతాయన్నారు. సంక్రాంతి పండుగ కోసం తమ సొంతూళ్లకు వెళ్లే నగర వాసులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకి వచ్చే ప్రయాణికుల కోసం ఈ ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకున్నారు.

24 గంటలూ ఫిర్యాదుల స్వీకరణ

ఫిర్యాదుల స్వీకరణ కోసం 24 గంటల పాటు నెం.9445014450, 9445014436లలో సంప్రదించవచ్చని రవాణాశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేటు బస్సుల్లో అధిక ప్రయాణ చార్జీలను వసూలు చేస్తే 1800 425 6151 అనే ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదేవిధంగా సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రోజువారీగా నడిపే 2,100 బస్సులతో కలిసి 4,830 ప్రత్యేక బస్సులను, మూడు రోజుల పాటు (మొత్తం 6,459 బస్సులు) నడపనున్నట్టు వివరించారు.

ఆరు ప్రాంతాలనుంచి...

సంక్రాంతి స్పెషల్ బస్సులను ఆరు ప్రాంతాల నుంచి నడిపేలా చర్యలు తీసుకున్నారు. పొన్నేరి, గుమ్మిడిపూండి, రెడ్‌హిల్స్ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే బస్సులను మాధవరం నుంచి, పుదుచ్చేరి, కడలూరు, చిదంబరం వైపు వెళ్లే బస్సులను కేకేనగర్ నుంచి, దిండివనం, విక్రయాండి మీదుగా తంజావూరు, కుంభకోణం వైపు వెళ్లే బస్సులను తాంబరం నుంచి, ఆర్కాడు, ఆరణి, వేలూరు, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, కాంచీపురం, చెయ్యారు, తిరుత్తణి ప్రాంతాల మీదుగా వెళ్లే వాహనాలు పూందమల్లి నుంచి బయలుదేరి వెళతాయన్నారు. విల్లుపురం, మదురై, సేలం, కోయంబత్తూరు, కుంభకోణం డివిజన్లకు చెందిన బస్సులు కోయంబేడు నుంచి వెళతాయన్నారు. తిరుచ్చి, తంజావూరు, కరూర్ మదురై, నెల్లై, తూత్తుక్కుడి, నాగర్‌కోయిల్ తదితర దక్షిణాది జిల్లాలకు వెళ్ళే బస్సులు కిళంబాక్కం బస్టాండు నుంచి వెళతాయని తెలిపారు. అలాగే, 12వ తేదీలోపు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులు తిరుచ్చి జాతీయ రహదారి మీదుగా వెళ్లే ఎస్ఈటీసీ బస్సులను కిళంబాక్కంలో ఎక్కవచ్చన్నారు. 12 నుంచి 14వ తేదీల మధ్య ప్రయాణించే ప్రయాణికులు కోయంబేడు, కిళంబాక్కం, తాంబరం, శానిటోరియం బస్టాండ్లలో బస్సులు ఎక్కవచ్చన్నారు.





ఆళ్వార్‌పేట రేషన్‌షాపు వద్ద పొంగల్ కానుకల పంపిణీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - నగరంలోని రేషన్‌షాపు వద్ద పొంగల్ కానుకల కోసం బారులు తీరిన కార్డుదారులు

పొంగల్ కానుకలు షురూ

- పంపిణీ ప్రారంభించిన సీఎం
- 1.77 లక్షలమందికి ఉచిత చీరలు, ధోవతులు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని 2.19 కోట్ల మంది బియ్యం కార్డుదారులకు పొంగల్ వస్తువులు, నగదు కానుకల పంపిణీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శ్రీకారం చుట్టారు. ఆళ్వార్‌పేటలో టీయూసీఎస్ రేషన్‌షాపులో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్డుదారులకు కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర కలిగిన పసుపు సంచిని, చెరకు గడను, రూ.1000 నగదును పంపిణీ చేశారు. అదే సమయంలో ప్రభుత్వం యేటా సంక్రాంతికి అందజేసే ఉచిత చీరలు, ధోవతులను అందజేశారు. తొలుత ఈ పొంగల్ కానుకలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది, కేంద్ర ప్రభుత్వోద్యోగులు మినహా తక్కిన బియ్యంకార్డుదారులందరికీ అందిస్తామని సీఎం ప్రకటించారు. అయితే ఈ పొంగల్ కానుకను బియ్యంకార్డులు కలిగి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పంపిణీ చేయాలని పలు వర్గాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చాయి. దీనితో పొంగల్ కానుకల పంపిణీ ఏర్పాట్లు ముగియనున్న తరుణంలో బియ్యంకార్డులు కలిగి ఉన్న అందరికీ ఆ కానుకలను అందిస్తామంటూ మంగళవారం సాయంత్రం స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు బియ్యం రేషన్ కార్డుదారులు, శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల్లో ఉన్న శరణార్థులు సహా 2,19,71,113 మందికి పొంగలి తయారీకి అవసరమైన పచ్చిబియ్యం, చక్కెర, చెరకు గడ, ఉచిత చీరలు, ధోవతులు, రూ.1000 నగదు పంపిణీ బుధవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ నెల 8, 9 తేదీల్లో కార్డుదారులకు టోకెన్లను పంపిణీ చేసి, రేషన్‌షాపుల వద్ద నిర్ణీత సమయాల్లో రోజుకు 200నుండి 500 మంది వరకు కానుకలను పోలీసుల భద్రతా ఏర్పాట్ల నడుమ పంపిణీ చేశారు.

ఆనందంగా ఉంది....

పంపిణీ అనంతరం సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... సంక్రాంతి సందర్భంగా బియ్యం కార్డుదారులందరికీ పొంగల్ కానుకలు పంపిణీ చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇటీవల వరదలు, తుపాను కారణంగా ఆర్థిక సమస్యలు ఎదురైనా, ప్రభుత్వంపై అదనపు వ్యయ భారం పడినా పండుగ పూట రాష్ట్రప్రజలన సంతోషమే ప్రాధాన్యంగా భావించి బియ్యంకార్డు కలిగిన అందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. ఇదే విధంగా రాష్ట్రమంతటా 1.77 కోట్ల మందికి సంక్రాంతి సందర్భంగా ఉచిత చీరలు, ధోవతులు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఆర్ పెరియ కరుప్పన్, ఎ. చక్రపాణి, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, శాసనసభ్యుడు డి.వేలు, సహకార ఆహార వినియోగదారుల సంరక్షణ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.గోపాల్, ఆహార వస్తువుల పంపిణీ శాఖ కార్యదర్శి హర్‌సహాయ్ మీనా, సహకార సంఘాల రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.సుబ్బయ్యన్ తదితరులు పాల్గొన్నారు.

14 వరకు కానుకలు...


బియ్యం రేషన్‌కార్డుదారులకు ఈనెల 14 వరకు సంక్రాంతి కానుకలను, ఉచిత చీరలు, ధోవతులను పంపిణీ చేయనున్నట్లు ఆహార శాఖ మంత్రి ఎ.చక్రపాణి తెలిపారు. చెన్నైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌షాపుల వద్ద ప్రశాంతంగా కార్డుదారులకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేయడానికి టోకెన్లు జారీ చేశామన్నారు. టోకెన్లు లేకపోయినా కార్డుదారులు నేరుగా వెళ్లి పొంగల్ కానుకలను పొందవచ్చునని చెప్పారు. ఈ కానుకలను ఈనెల 14 వరకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు పని చేయనున్న రేషన్ దుకాణాలు

పెరంబూర్, జనవరి 10: రాష్ట్రంలోని రేషన్ దుకాణాలు శుక్రవారం యథావిధిగా పనిచేయనున్నాయి. ఈ మేరకు ఆహార భద్రతా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... రేషన్ దుకాణాలకు ప్రతి శుక్రవారం సెలవు దినమని, కానీ, ప్రస్తుతం రూ.1,000 నగదుతో కూడిన పొంగల్ కానుక అందజేస్తుండడంతో ప్రజల సౌకర్యార్థం ఈనెల 12న రేషన్ దుకాణాలు యథావిధిగా పనిచేస్తాయని ఆ శాఖ పేర్కొంది.

అడ్వకేట్ జనరల్ రాజీనామా

- కొత్త ఏజీగా పీఎస్ రామన్?



షణ్ముగసుందరం

అడయార్, జనవరి 10: రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఆర్.షణ్ముగసుందరం తన పదవికి రాజీనామా చేశారు. ఇది ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 1996 నుంచి 2001 వరకు రాష్ట్ర ప్రధాన క్రైం న్యాయవాదిగాను, 2002 నుంచి 2008 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2021లో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ ప్రధాన అడ్వకేట్ జనరల్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆకస్మికంగా ఏజీ పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. తన వ్యక్తిగత కారణాల రీత్యా ఏజీ పదవికి రాజీనామా చేయగా, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు కూడా తెలిపినట్టు సమాచారం. ఏజీగా రాజీనామా చేసిన తర్వాత ఆయన వ్యక్తిగతంగా న్యాయవాదవృత్తిలో కొనసాగనున్నారు. మరోవైపు, షణ్ముగసుందరం రాజీనామాతో కొత్త ఏజీగా పీఎస్ రామన్‌ను నియమించే అవకాశాలు అధికంగా ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మురుగన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాలకు ఏడాదికి ఐదుసార్లు తీర్థయాత్ర

- వృద్ధులకు మంత్రి శేఖర్‌బాబు వరం



మాజీ ఆలయ ఉద్యోగులకు పొంగల్ నగదు కానుకలను అందజేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన తిరుత్తణి, తిరుచెందూరు, స్వామిమలై, తిరుప్పరంకుండ్రం సహా ఆరు దివ్యదేశాలను సీనియర్ సిటిజన్లు దర్శించేలా యేడాదికి ఐదుసార్లు ఉచిత తీర్థయాత్రలను నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. నుంగంబాక్కంలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ఆలయ ఉద్యోగులకు పొంగల్ కానుకలు, రూ.1000 నగదును ఆయన పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అరవైయేళ్లపైబడిన వృద్ధులను మురుగన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాలను తీర్థయాత్రగా వెళ్లి దర్శించే అరుదైన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు. ఈ ఉచిత తీర్థయాత్రకు సంబంధించిన దరఖాస్తులు దేవాదాయ శాఖ వెబ్‌సైట్‌లో లభిస్తాయని, తొలివిడతగా 200 మంది వృద్ధులకు ఈ అవకాశం కల్పిస్తామని చెప్పారు.





రోడ్డుపై బైఠాయించి కార్మికుల నిరసన - పల్లవన్ హౌస్ వద్ద ఆందోళనలో రవాణా కార్మికులు

రవాణా కార్మికుల ధర్నాతో ఉద్రిక్తం

పలువురి అరెస్టు



కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్యారీస్, జనవరి 10: వేతనం పెంపు, పాత పింఛన్ విధానం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర ఆరు డిమాండ్లు నెరవేర్చాలని రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖలో పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది కార్మికులు విధులు బహిష్కరించినప్పటికీ, బస్సు సర్వీసులు యథావిధిగా సాగాయి. సీఐటీయూ, అన్నా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బస్సు డిపోల ముట్టడి, రాస్తారోకో, నిరసన ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. రవాణా కార్మికులు కోరుతున్న ఆరుడిమాండ్ల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహించిన మూడు విడతల చర్చలు కొలిక్కిరాలేదు. దీంతో అన్నా కార్మికుల సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ సహా 13 కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు రెండో రోజు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అన్నాసాలై పల్లవన్ హౌస్ ముందు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సౌందర్‌రాజన్ నేతృత్వంలో రవాణా కార్మికులు తమ కోర్కెలు నెరవేర్చాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదే విధంగా అన్నా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కమలకన్నన్ సూచన మేరకు చెన్నైలోని పలు ఎంటీసీ డిపోల ముందు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు కార్మికులను అరెస్ట్ చేసి ఎంటీసీ బస్సుల్లో ప్రైవేటు కల్యాణ మండపాలకు తరలించేందుకు యత్నించారు. అయితే అందుకు కార్మికులు అభ్యంతరం తెలియజేయడంతో వారిని పోలీసు వాహనాల్లో తరలించారు. అదే విధంగా తంజావూరు పాత బస్టాండ్ ముందు రవాణా కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈరోడ్ జిల్లా సత్యమంగళంలో అనుమతి లేకుండా రాస్తారోకోలో పాల్గొన్న కార్మికులను అరెస్ట్ చేశారు. కాంచీపురం బస్టాండ్ ముందు బైఠాయించిన కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చర్చలకు సిద్ధం : సీఐటీయూ

ప్రభుత్వ రవాణా శాఖలో పనిచేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు పలుమార్లు కార్మిక సంఘాల ద్వారా సర్కారుకు విన్నవించుకున్నా పరిష్కారం కనిపించలేదని సీఐటీయూ నేతలు చెప్పారు. 2003 తర్వాత కండక్టర్, డ్రైవర్ ఉద్యోగాల్లో చేరిన వారికి ఇప్పటివరకు పాత పింఛన్ పంపిణీ చేయలేదని, ఆరు డిమాండ్లలో ఒక్కదాన్ని కూడా నెరవేర్చనందువల్లే తాము సమ్మెలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానిస్తే పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సౌందర్‌రాజన్ తెలిపారు.

పండుగ పూట సమ్మె అవసరమా?

- కార్మిక సంఘాలు, ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం
- దిగొచ్చిన కార్మికులు..సమ్మె వాయిదా
- 19న కార్మికులతో చర్చలు: ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ 20 నుంచి సమ్మె: సీఐటీయూ



చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమయంలో రవాణా కార్మికులు సమ్మె చేపట్టడంపై మద్రాస్ హైకోర్టు నిలదీసింది. అదే సమయంలో సమస్యల పరిష్కారం వ్యవహారంలో కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం మంకుపట్టు పట్టడంపై ప్రశ్నించింది. ప్రజల్ని ఇబ్బంది పెట్టే ఇలాంటి చర్యలు భావ్యమేనా అని ఇరువర్గాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో రెండు రోజులుగా సమ్మె చేపడుతున్న కార్మిక సంఘాలు ఎట్టకేలకు దిగొచ్చాయి. ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు హైకోర్టుకు తెలిపాయి. అదే సమయంలో ఈనెల 19న కార్మిక సంఘాలతో త్రైపాక్షిక చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు.

నిషేధం విధించండి...

రవాణా కార్మికుల సమ్మె పిలుపుపై నిషేధం విధించాలని కోరుతూ షోళింగనల్లూరుకి చెందిన పాల్‌గిద్యోన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... పండుగ సమయంలో ఈ సమ్మె చేపట్టడమేంటని ప్రశ్నించింది. 'ఈ సమ్మె వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగుతాయి కదా? రాష్ట్రమంతటా ఘనంగా జరుపుకునే సంక్రాంతి సందర్భంగా ప్రజలకు ఎందుకు ఇబ్బందులు కలిగిస్తున్నారు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రవాణా కార్మికుల సమ్మెవల్ల నగరాల్లోని ప్రజలకు ఇబ్బందులు కలుగకపోవచ్చునేమోగాని, గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజానీకం తీవ్రంగా నష్టపోతారని, ఈ వ్యవహారంలో అటు ప్రభుత్వం, ఇటు కార్మిక సంఘాలు మంకుపట్టు పడుతుండటం భావ్యమేనా? అంటూ నిలదీసింది. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెను తాము తప్పుబట్టడం లేదని, అదే సమయంలో అనువుగాని పండుగ సమయంలో ఈ సమ్మె అవసరమా అని ఆ సంఘాలు ఆలోచించాలని సూచించింది. ఈ సమ్మెను నెలాఖరువరకూ వాయిదా వేసే విషయమై కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. అదే సమయంలో మాజీ రవాణా కార్మికులకు పింఛన్ బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించే అవకాశం ఉందోలేదో అనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయాన్ని ప్రకటించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

తాత్కాలికంగా వాయిదా...

ధర్మాసనం ముందు మళ్లీ విచారణ సందర్భంగా కార్మిక సంఘాలు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు వారి తరఫు న్యాయవాదులు తెలిపారు. అదే విధంగా పింఛన్‌దారుల కరవు భత్యం బకాయిలు చెల్లించే విషయమై ఈనెల 19న ప్రభుత్వం త్రైపాక్షిక చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. దీంతో ఈనెల 19 తర్వాత కార్మిక సంఘాల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయని తాము భావిస్తున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

రెండో రోజు 98 శాతం బస్సులు...

కార్మిక సంఘాల సమ్మె పిలుపుపై స్పందన లేకపోవడంతో రెండో రోజు రవాణా సంస్థల్లో బస్సులు యథావిధిగా నడిచాయి. అన్నాడీఎంకే కార్మిక సంఘం దాని మద్దతు సంఘాలకు చెందిన కార్మికులు మాత్రమే సమ్మెలో పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం 98 శాతం బస్సులు నడిపినట్లు రవాణా సంస్థ ఉన్నతాధికారి తెలిపారు. రవాణా శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు, కండక్టర్లను తాత్కాలికంగా నియమించి బస్సులను పూర్తిస్థాయిలో నడిపేందుకు అన్ని డిపోల్లో అధికారులు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగని రీతిలో మంగళవారం 95 శాతం బస్సులు, బుధవారం 98 శాతం బస్సులు నడిపినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వంద శాతం ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు నడిపామని, అదే విధంగా విల్లుపురం డిపో పరిధిలో 97.19 శాతం బస్సులు, సేలండిపో పరిధిలో 97.09 శాతం బస్సులు, కుంభకోణం డిపో పరిధిలో 97.47 శాతం బస్సులు, మదురైలో 98.79 శాతం పనులు, తిరునల్వేలిలో 95.51 శాతం బస్సులు నడిచాయి. రాష్ట్రవ్యాప్తంగా 15236 బస్సులకుగాను 14888 బస్సులు నడిచాయి. ఇక చెన్నైలోని ఎంటీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడిపేందుకు రవాణా శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. బుధవారం ఉదయం 8గంటల ప్రాంతంలో 3,233 ఎంటీసీ బస్సులకుగాను 3,177 బస్సులు నడిపినట్లు అధికారులు ప్రకటించారు.

సమ్మెకు దిగిన కార్మికుల వివరాల సేకరణ...

రాష్ట్ర రవాణా సంస్థలలో రెండు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల వివరాలను రవాణా శాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఆయా డిపో మేనేజర్ల నుంచి ఈ వివరాలను సేకరించే పనుల్లో ఉన్నారు. 8 డిపోలలో సమ్మె చేస్తున్న కార్మికులకు త్వరలో షోకాజు నోటీసులు జారీ చేయాలని కూడా అధికారులు భావిస్తున్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 10: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఐటీ కారిడార్, అడయార్‌లో కొన్ని ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

ఐటీ కారిడార్: సిరుచ్చేరి వేంబులి అమ్మన్ ఆలయ వీధి, అంబేడ్కర్ వీధి, నాదం లింక్ రోడ్డు, పలండి అమ్మన్ ఆలయ వీధి

అడయార్: ఐఐటీ, గాంధీమండపం రోడ్డు, సర్దార్ పటేల్ రోడ్డు, కోట్టూరుపురం, శ్రీనగర్ కాలనీ, వెంకటాపురం, చిన్నమలై, తరమణి, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, కానగం, కలికుండ్రం, పల్లిపట్టు, శ్రీరామ్‌నగర్, నెహ్రూనగర్ 1 నుంచి 4 వీధులు, కేకేనగర్ 1 నుంచి 5 మెయిన్ రోడ్లు, గోవిందరాజపురం, భక్తవత్సలం నగర్ 1నుంచి 5 వీధులు.

సంక్రాంతికి అన్‌రిజర్వుడు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తాంబరం నుంచి తూత్తుకుడి, తిరునల్వేలికి అన్‌రిజర్వుడు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.06001 తాంబరం - తూత్తుకుడి అన్‌రిజర్వుడు స్పెషల్ ఈనెల 14, 16 తేదీల్లో ఉదయం 7.30 గంటలకు తాంబరం నుంచి బయల్దేరి రాత్రి 11.45 గంటలకు తూత్తుకుడి చేరుకుంటుంది. అలాగే, నెం.06002 తూత్తుకుడి - తాంబరం ప్రత్యేక రైలు ఈనెల 15, 17 తేదీల్లో ఉదయం 6 గంటలకు తూత్తుకుడిలో బయల్దేరి రాత్రి 8.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

● నెం.06003 తాంబరం - తిరునల్వేలి ప్రత్యేక రైలు ఈ నెల 11, 13, 16 తేదీల్లో తాంబరంలో రాత్రి 9.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది. అలాగే, నెం.06004 తిరునల్వేలి - తాంబరం ప్రత్యేక రైలు ఈ నెల 12, 14, 17 తేదీల్లో తిరునల్వేలి నుంచి మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

బీబీఏ కోర్సులకు ఏఐసీటీఈ నిబంధనలు

ఐసిఎఫ్, జనవరి 10: ఉన్నత విద్యాసంస్థలకు బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి ఏఐసీటీఈ నిబంధనలు అమలు పరుస్తున్నట్లు యూజీసీ తెలిపింది. దేశంలో ఉన్న ఉన్నత విద్యాసంస్థలు నిర్వహించే సాంకేతిక కోర్సులకు కేంద్రప్రభుత్వ అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ (ఏఐసీటీఈ) అంగీకారం పొందాలి. ఇంజనీరింగ్, ఆర్కిటెక్ట్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు అంగీకారం పొందేందుకు కొత్త నిబంధనలను ఏఐసీటీఈ విధించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ వంటి యూజీ కోర్సులకు ఈ నిబంధనలు అమలు కానున్నాయని ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ సర్క్యులర్ పంపింది.

సినిమా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 10: సినీ పరిశ్రమకు చెందిన వారు రాష్ట్రప్రభుత్వం అందజేసే పురస్కారాలకు ఈనెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సమాచార శాఖ డైరెక్టర్ మోహన్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో 2019-22 వరకు సినిమా పురస్కారాలు, 2018-22 వరకు తక్కువ బడ్జెట్‌తో రూపొందించి విడుదలైన చిత్రాలకు సబ్సిడీ, 2015-22 మధ్య బుల్లితెర పురస్కారాలు అందజేయనున్నారు. మంగళవారంతో ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువు ఈనెల 31వరకు పొడిగించారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక కలైవానర్ అరంగం మొదటి అంతస్తులో ఉన్న సినీపరిశ్రమకు చెందిన సంక్షేమ బోర్డు కార్యాలయంలో సమర్పించాలని డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే అడ్మిషన్లు

ఐసిఎఫ్, జనవరి 10: వైద్యకళాశాలలు పీజీ వైద్యకోర్సుల్లో విద్యార్థులను నేరుగా చేర్చుకోరాదని, జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే చేర్చుకోవాలని జాతీయ వైద్య కమిషన్ తెలిపింది. పీజీ వైద్యకోర్సులకు సంబంధించి కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి...

- నీట్ అర్హత ఆధారంగా అనుమతించిన సీట్ల ప్రకారం విద్యార్థుల అడ్మిషన్లు చేపట్టాలి.
- కళాశాలల్లో పీజీ వైద్య కోర్సు సీట్లను ప్రకటిస్తున్నప్పుడే, ఒక్కో కళాశాల ఫీజుల వివరాలు విడుదల చేయాలి.
- జాతీయ, రాష్ట్రస్థాయిలో జరిగే అన్ని పీజీ, ప్రత్యేక వైద్య విద్యార్థుల అడ్మిషన్లు ఆన్‌లైన్ విధానంలోనే అనుమతించాలి. అడ్మిషన్లలో పారదర్శకత పాటించాలి.
- 100 పడకలు కలిగిన జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో మాత్రమే ఇన్నర్ ట్రైనింగ్ పొందేందుకు అనుమతి ఉండగా, ఇకపై 50 పడకలు కలిగిన ఆసుపత్రుల్లోనూ శిక్షణ పొందవచ్చు.

నేడు, రేపు ప్రవాస తమిళుల దినోత్సవాలు

పెరంబూర్, జనవరి 10: స్థానిక నందంబాక్కంలోని వర్తక కేంద్రంలో గురు, శుక్రవారాల్లో ప్రవాస తమిళుల దినోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకలను మంత్రి ఉదయనిధి ప్రారంభించనుండగా, సీఎం స్టాలిన్ ప్రసంగించనున్నారు. వేడుకల్లో 58 దేశాలకు చెందిన తమిళుల వంశీయులు, మంత్రులు, తమిళ పండితులు పాల్గొననున్నారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

29 నుంచి తిరుపతి - కాట్పాడి రైళ్ల రద్దు

పెరంబూర్, జనవరి 10: గుంతకల్ డివిజన్‌లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈనెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు ప్యాసింజర్, మెమో రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.07659 తిరుపతి-కాట్పాడి ప్యాసింజర్‌రైలు ఈనెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.07582 కాట్పాడి-తిరుపతి ప్యాసింజర్‌రైలు ఈనెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.06417 కాట్పాడి-జోలార్‌పేట మెమోస్పెషల్ ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు పూర్తిగా రద్దు.
- నెం.06418 జోలార్‌పేట-కాట్పాడి మెమో స్పెషల్ ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు పూర్తిగా రద్దు.

పాక్షిక రద్దు

● నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 29వ తేది నుంచి మార్చి 3వ తేది వరకు తిరుపతికి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది.

● నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ ఈనెల 29 నుంచి మార్చి 3వ తేది వరకు తిరుపతికి బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది.

ఆలయ ఉద్యోగులకు రూ.3 వేలు కారుణ్య భత్యం

ఐసిఎఫ్, జనవరి 10: ఆలయ ఉద్యోగులకు రూ.3 వేలు సంక్రాంతి కారుణ్య భత్యం అందజేసేందుకు హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ మురళీధరన్ అనుతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ఓవర్ పేమెంట్ అందజేసేందుకు ఈనెల 5వ తేది జీవో విడుదలైంది. ఆ ప్రకారం, ఫుల్ టైం, పార్ట్ టైం, దినకూలీలు సహా అన్ని ఆలయాల ఉద్యోగులకు పొంగల్ కారుణ్య భత్యంగా రూ.3 వేలు అందించేందుకు అనుమతి లభించింది. ఆలయ ఉద్యోగులు రూ.3,000 పొందేందుకు 2022-23 సంవత్సరంలో 240 రోజులకు పైగా విధులు నిర్వహించి ఉండాలి. అయితే 240 రోజులకు తక్కువగా విధులు నిర్వహించిన వారికి పనిదినాలను బట్టి కారుణ్య భత్యంలో కోతలుంటాయని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

వేలూరు, జనవరి 10: స్థానిక కాట్పాడి యూనియన్ పరిధిలోని 18 పాఠశాలలకు చెందిన 2,104 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నీటి పారుదల శాఖ మంత్రి దురైమురుగన్ హజరై విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 1971లో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టానని, అప్పుడు ఈ ప్రాంతంలో ఒకే ఒక పాఠశాల ఉండేదన్నారు. అనంతరం తన 54 ఏళ్ల ఎమ్మెల్యే కాలంలో ఈ ప్రాంతంలో 18 పాఠశాలలు ప్రారంభించానని తెలిపారు. విద్యారంగంలో జిల్లా అగ్రగామి ఉండాలన్నది తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వేలూరు ఎంపీలు కదిర్ ఆనంద్, జగద్రక్షకన్, మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్‌కుమార్, మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజ, యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, కౌన్సిలర్లు విమల శ్రీనివాసన్, అన్బు, కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

రక్తపోటు తగ్గించుకోవడానికే అన్నామలై పాదయాత్ర

● ధర్మపురి ఎంపీ సెంథిల్ కుమార్ చురక



పెరంబూర్, జనవరి 10: వైద్యుల సూచనల మేరకు రక్తపోటు తగ్గించుకొనేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొద్ది దూరం పాదయాత్ర చేస్తున్నాడని ధర్మపురి ఎంపీ సెంథిల్‌కుమార్ ఎద్దేవా చేశారు. ధర్మపురి ఎస్వీ రోడ్డులో ఎంపీ నియోజకవర్గ నిధుల నుంచి ఏర్పాటు చేసిన హై ఓవర్ లైట్లను మంగళవారం ప్రారంభించిన ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ... అన్నామలై చేపట్టింది పాదయాత్ర కాదన్నారు. రక్తపోటు, అధిక ఒత్తిడి తదితర సమస్యలు తగ్గించుకొనేందుకు వైద్యుల సూచనల మేరకు రోజూ కొద్ది దూరం నడుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర నిజమైన పాదయాత్ర అన్నారు. ప్రతి జిల్లాల్లో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ రాహుల్ పాదయాత్ర సాగిందన్నారు. ప్రధానమంత్రి గృహ కల్ప పేరిట చేపట్టిన పథకానికి వినియోగించే నిధులు ప్రజల పన్నుల రూపంలో చెల్లించినవేనని, అవేమీ ప్రధాని జేబు నుంచి తీసిచ్చినవని కావన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు 60 శా తం కేంద్రం, 40 శాతం రాష్ట్రప్రభుత్వం నిధులు సమకూరుస్తున్నాయని ఎంపీ తెలిపారు.

రూ.450 కోట్లతో రైలుపెట్టెల కొనుగోలు

ఐసిఎఫ్,జనవరి10:మెట్రోరైలు రెండో విడత పథకంలో రైలుపెట్టెలను రూ.450 కోట్లతో కొనుగోలు చేయనున్నట్లు సీఎంఆర్‌ఎల్ తెలిపింది. మెట్రో పనుల కోసం నిధుల సమీకరణకు స్వదేశీ వాణిజ్య బ్యాంకులను సీఎంఆర్‌ఎల్ ఆశ్రయించడం ఇదే తొలిసారి.రూ.450కోట్లను స్టేట్‌బ్యాంక్‌ఆఫ్‌ఇండియా అందజేసింది.ఈ నిధులతో పెట్టెలు, ఇతర ఉపకరణాలు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ర్యాగింగ్‌పై ఫిర్యాదులొస్తే ప్రిన్సిపాళ్లకు సమన్లు

ఐసిఎఫ్, జనవరి 10: కళాశాలల్లో ర్యాగింగ్ సమస్యలు తలెత్తితే ప్రిన్సిపాల్, వర్శిటీ రిజిస్ట్రార్లకు సమన్లు జారీ చేయనున్నట్లు యూజీసీ హెచ్చరించింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్‌జైన్ కళాశాలలు, వర్శిటీలకు పంపిన సర్క్యులర్‌లో... ఉన్నత విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ర్యాగింగ్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇలాంటివి పునరావృత్తమైతే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, వర్శిటీ రిజిస్ట్రార్‌కు సమన్లు "జారీ చేస్తామని హెచ్చరించారు. ర్యాగింగ్ జరిగి పోలీసు విచారణ జరిగినా, కళాశాల, వర్శిటీ స్థాయిలో ర్యాగింగ్ నిరోధక కమిటీ, జాతీయ కమిటీలు విచారణ చేపడతాయని తెలిపారు. కమిటీలు చర్యలు చేపట్టక ముందే ర్యాగింగ్ అడ్డుకొనేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

డీఎంకే కౌన్సిలర్‌పై బహిష్కరణ వేటు

● మంత్రి దురైమురుగన్ ప్రకటన

అడయార్, జనవరి 10: చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 51వ వార్డు కౌన్సిలర్ నిరంజన జగదీశన్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ విషయంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చెన్నై ఉత్తర జిల్లా రాయపురం తూర్పు విభాగం 51వ వార్డు కౌన్సిలర్‌గా నిరంజన జగదీశన్ ఉండగా, ఈమె భర్త జగదీశన్ తన భార్య అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయం పార్టీ అధిష్ఠానం దృష్టికి రావడంతో ఆ కౌన్సిలర్ దంపతులను పలుమార్లు హెచ్చరించింది. అయినప్పటికీ వారు తమ ప్రవర్తనను మార్చుకోలేదు. దీంతో పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించారన్న కారణంతో కౌన్సిలర్ నిరంజన జగదీశన్‌పై బహిష్కరణ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. నేటినుంచి ఆమెను అన్ని రకాల పార్టీ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్టు మంత్రి దురైమురుగన్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

నలుగురు బీజేపీ నాయకులపై కేసు


అడయార్, జనవరి 10: బ్యూటీ పార్లర్‌కు లైసెన్స్ తీసిస్తామని నమ్మించి రూ.25 లక్షల మేరకు మోసం చేసిన కేసులో బీజేపీ చెందిన నలుగురు నాయకులను నగర పోలీసులు అరెస్టు చేశారు. మనలి, పుదునగర్‌కు చెందిన మలర్‌ది (33) అనే మహిళ మనలి 16వ విభాగం మహిళా విభాగం కార్యదర్శి. ఈమె అంబత్తూరులో బ్యూటీపార్లర్, స్పా సెంటర్లను నడుపుతున్నారు. ఈ క్రమంలో తమ బ్యూటీ పార్లను పోరూర్‌తో పాటు అంబత్తూరులో తెరిచేందుకు లైసెన్సుల కోసం యత్నిస్తున్నారు. ఇదే విషయంపై బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పొన్ భాస్కర్‌కు ఆమె రూ.25 లక్షలు ఇచ్చినట్టు సమాచారం. అయితే, బ్యూటీ, స్పా సెంటర్లకు లైసెన్సులు తీసివ్వకపోగా, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో ఆమె ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ శంకర్ ఆదేశం మేరకు బీజేపీ నిర్వాహకులు పొన్ భాస్కర్, కార్తీక్ రాజ్, శివప్రకాష్ సహా నలుగురిపై కేసు నమోదు చేశారు.

2500 మద్యం బాటిళ్లు స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

అడయార్, జనవరి 10: పుదుచ్చేరి నుంచి అక్రమంగా చెన్నైకు తరలిస్తున్న 2500 మద్యం బాటిళ్లను విల్లుపురం జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఇద్దరిని అరెస్టు చేశారు. పుదుచ్చేరి నుంచి విల్లుపురం మీదుగా తిరువణ్ణామలై ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో నిఘా వేసిన విల్లుపురం పోలీసులు... తిరువణ్ణామలై సర్కిల్ పూత్తమేడులో వాహనంలో తీసుకొస్తున్న 2500 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని భరత్, విష్ణుదేవ్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.


కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



గిండిలోని అన్నా వర్శిటీ ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాధాకృష్ణన్, సందీప్‌రాయ్ రాథోర్ తదితరులు

పెరంబూర్, జనవరి 10: పార్లమెంటు ఎన్నికల ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. ఆ ప్రకారం, దక్షిణ చెన్నై పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు గిండిలోని అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణం, ఉత్తర చెన్నై పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు రాణి మేరీ కళాశాల, మధ్య చెన్నై పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు లయోలా కళాశాలల్లో జరగనున్నాయి. ఈ లెక్కింపు కేంద్రాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషన్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ పరిశీలించారు. ఆయన వెంట నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ సహా పలువురు అధికారులున్నారు.

ఆస్తికోసం ఆరేళ్లపాటు వృద్ధురాలి గృహనిర్బంధం



గృహనిర్బంధంలో ఉన్న వృద్ధురాలు జయం

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా ముత్తుపేట సమీపం థిల్లైవిలాగం మేల్‌కరైలో ఆస్తి కోసం బంధువులు ఓ వృద్ధురాలిని ఆరేళ్లపాటు గృహనిర్బంధంలో ఉంచి వేధింపులకు గురిచేసిన సంఘటన వెలుగు చూసింది. ఆ గ్రామంలో పళని దురై, జయం (65) అనే భార్యాభర్తలు నివసించేవారు. పదేళ్లకు ముందు పళనిదురై మృతి చెందటంతో వారసులు లేని ఆయన ఆస్తులను కాజేసేందుకు బంధువులు ప్రయత్నించారు. జయంను ఆమె ఇంట్లోనే నిర్బంధించి ఆరేళ్ల పాటు ఆమె ఆస్తులను అనుభవిస్తూ వచ్చారు. ఆరేళ్లుగా ఇంటిలోనే చీకటిలోనే గడుపుతూ బంధువులు పూటకింత భోజనం పెడుతూ చేసిన చిత్రహింసలకు ఆమె ప్రత్యక్షనరకాన్ని అనుభవించింది. ఆ ఇంటి పరిసరాల్లో దుర్గంధం వ్యాపించడాన్ని గమనించి స్థానికులు ఇంటిలో నిర్బంధంలో ఉన్న ముదుసలిని వీడియో తీసి ప్రసార మాధ్యమాల్లో వెలువరించారు. ప్రస్తుతం ఆ వీడియో నెటిజన్లకు కంట తడిపెట్టిస్తోంది.

మంత్రి అనితా రాధాకృష్ణన్ కేసు వాయిదా

పెరంబూర్, జనవరి 10: మంత్రి అనితా రాధాకృష్ణన్‌పై అదనపు ఆస్తుల కేసు ఈనెల 24వ తేదీకి తూత్తుకుడి జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి స్వామినాథన్ వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2001-06 మధ్య అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో గృహ వసతి, నగరాభివృద్ధి శాఖ మంత్రిగా వ్యవహరించిన అనితా రాధాకృష్ణన్ ఆదాయానికి మించి రూ.4.90 కోట్ల ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలున్నాయి. 2006లో డీఎంకే ప్రభుత్వ హయాంలో, మంత్రి అనితా రాధాకృష్ణన్, ఆయన భార్య జయకాంతి, సోదరులు షణ్ముగనాథన్, శివానందం, కుమారులు ఆనంద్ పద్మనాభన్, ఆనంద్ మహేశ్వరన్, ఆనంద్ రామకృష్ణన్ తదితర ఏడుగురికిపై తూత్తుకుడి ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బుధవారం విచారణకు రాగా, ప్రధాన న్యాయమూర్తి సెల్వం సెలవులో ఉండడంతో, తదుపరి విచారణ ఈనెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

వరద సాయంగా అదనపు నిధులివ్వాలంటూ పిటిషన్

పెరంబూర్, జనవరి 10: వరద నష్టాలకు సంబంధించిన అదనంగా నిధులు అందించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తూత్తుకుడికి చెందిన ఎళిలన్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో... భారీ వర్షాలతో తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. విద్యుత్, ఆహారం లేక, ఇళ్లలో నీరు చేసిన ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. దీన్ని విపత్తుగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించలేదన్నారు. సహాయ నిధులు కూడా బాధిత ప్రజల చెంతకు చేరలేదన్నారు. ఈ ఘటనను విపత్తుగా ప్రకటించాలని, రేషన్ కార్డుదారులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రూ.6 వేలను రూ.10 వేలకు పెంచేలా ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తులు కృష్ణన్‌కుమార్, ఆర్.విజయకుమార్‌తో కూడిన ధర్మాసనం... కేంద, రాష్ట్ర విపత్తుల నివారణ కమిషన్లకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేశారు.

ఖేలో ఇండియా పోటీల అవగాహన మారథాన్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

వేలూరు, జనవరి 10: స్థానిక కోట సమీపంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా పోటీలపై అవగాహన కల్పించేలా బుధవారం మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌ను కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ ప్రారంభించారు. 200 మందికి పైగా విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత, జిల్లా క్రీడల శాఖ అధికారి నొయలిన్‌జాన్ సహా పలువురు పాల్గొన్నారు.

అన్నదానం



వేలూరు, జనవరి 10: స్థానిక కార్పొరేషన్ 1వ వార్డు కౌన్సిలర్ అన్బు బుధవారం జన్మదినం జరుపుకున్నారు. ఆయనకు పలువురు ప్రముఖులు, అధికారులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆయన అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీపీఐ నేత అప్పు అలియాస్ వెంకటేష్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయుడు సచ్చిదానందం, సారధి డిజిటల్ యజమాని శాంతి, డీఎంకే నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంథిల్ బాలాజీ అనుచరుడి హోటల్‌లో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు

పెరంబూర్, జనవరి 10: కరూర్‌లో మంత్రి సెంథిల్ బాలాజి అనుచరుడు మణికి చెందిన హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కరూర్‌లో సెంథిల్ బాలాజి సోదరుడు అశోక్‌కుమార్, ఆయన అనుచరుల ఇళ్లలో గత ఏడాది మే నెలలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. అనంతరం జూలై, డిసెంబరునెలల్లో కూడా తనిఖీలు కొనసాగాయి. ఈ నేప థ్యంలో, నాల్గో పర్యాయంగా బుధవారం మణికి చెందిన కరూర్ కోవై రోడ్డులో ఉన్న హోటల్‌లో కోవై నుంచి వచ్చిన ఏడుగురు ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంత్రి సెంథిల్ బాలాజి నగదు బట్వాడా కేసుకు సంబంధించి విచారణ ఈ నెల 12వ తేది రానున్న నేపథ్యంలో, హఠాత్తుగా ఆయన అనుచరుడి హోటల్‌లో అధికారులు తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది.

కాలి బూడిదైన పాఠశాల వ్యాన్

● క్షేమంగా బయటపడిన 44 మంది విద్యార్థులు



మంటల్లో తగులబడుతున్న వాహనం - పూర్తిగా దగ్ధమైన వాహనం

పెరంబూర్, జనవరి 10: పాఠశాల వాహనంలో మంటలు చెలరేగిన ఘటనలో 44 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపంలో పల్లం ప్రాంతంలో పాఠశాల విద్యార్థులతో వెళుతున్న వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కనే నిలపగా, విద్యార్థులు గబగబా బస్సు దిగేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపు చేస్తుండగా వాహనం పూర్తిగా దగ్గమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గవర్నర్‌కు నల్లజెండాలతో నిరసన

పెరంబూర్, జనవరి 10: సేలం పెరియార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు గురువారం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా సేలం వచ్చే గవర్నర్‌కు నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే విద్యార్థి విభాగం సహా 13 విద్యార్థి సంఘాలు నిర్ణయించాయి. నీట్ మినహాయింపు సహా పలు బిల్లులు ఆమోదించకుండా ఉన్న గవర్నర్ తీరును నిరసిస్తూ ఆయనకు నల్లజెండాలతో నిరసన తెలిపేందుకు అనుమతించాలని కోరుతూ బుధవారం ఆ సంఘాల ప్రతినిధులు నగర పోలీసు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

పదిచోట్ల పట్టాలపై కూలిన చెట్లు

ఊటీ కొండరైలు సర్వీసు రద్దు



కున్నూరు - మేట్టుపాళయం మార్గంలో పట్టాలపై పడిన చెట్లను తొలగిస్తున్నరైల్వే సిబ్బంది

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఊటీ కొండ రైలు మార్గంలో పదిచోట్ల చెట్లు, మట్టి పెళ్లలు కూలిపడ్డాయి. దీంతో బుధవారం కొండరైలు సర్వీసును రద్దు చేశారు. ప్రస్తుతం ఆ రైలు మార్గంలో చెట్లు, మట్టిపెళ్లల తొలగింపు పనులు జరుగుతుండటంతో మరో రెండు రోజులపాటు ఈ రైలు సర్వీసును రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. గత రెండు రోజులుగా ఊటీ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల కొండరైలు మార్గంలోని పదిచోట్ల చెట్లు, మట్టిపెళ్లలు కూలిపడ్డాయని పేర్కొన్నారు.



చెన్నై టి.నగర్ టీటీడీ శ్రీవారి ఆలయంలో గాత్రకచేరీ నిర్వహించిన కుమారి యదుశ్రీని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు కృష్ణారావు, కార్తికేయన్, రాధాకృష్ణమూర్తి, అజయ్, సత్యనారాయణ తదితరులు

జిల్లాలో రూ.4.49 లక్షల మందికి పొంగల్ కానుక



పొంగల్ కానుక అందిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, జనవరి 10: జిల్లావ్యాప్తంగా 4.49 లక్షల మందికి పొంగల్ కానుక అందించనున్నట్టు మంత్రి దురైమురుగన్ తెలిపారు. కాట్పాడిలోని రేషన్ దుకా ణంలో బుధవారం జరిగిన పంపిణీలో మంత్రి పాల్గొని, రేషన్‌కార్డుదారులకు పొంగల్ కానుక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్శిటీ వైస్ ఛాన్సలర్ నియామకాలకు సంబంధించిన సెర్చి కమిటీ నియామకాన్ని గవర్నర్ వెనక్కు తీసుకోవడాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన రైలింజన్



పెరంబూర్, జనవరి 10: స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్ రైలింజన్ పట్టాలు తప్పింది. స్థానిక చెట్‌పెట్ సమీపంలోని యార్డులో బోగీలను వదిలిన రైలింజన్ ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో 1వ ప్లాట్‌ఫాం మీదుగా వెళ్తున్న సమయంలో మూడు చక్రాలు పట్టాలు తప్పాయి. పెద్ద శబ్దంతో రైలు ఆగిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే సాంకేతిక అధికారులు, కార్మికులు అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టి పట్టాలపైకి చేర్చారు.

అదుపుతప్పిన బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

పెరంబూర్, జనవరి 10: రాష్ట్రవ్యాప్తంగా ఆరు డిమాండ్ల సాధన కోసం రవాణా కార్మికులు సమ్మె బాట పట్టారు. తూత్తుకుడి జిల్లాలో 95శాతం బస్సులు నడుపుతున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలుపుతున్నా, వాటిలో ఎక్కువ బస్సులను కాంట్రాక్ట్ డ్రైవర్లు, కార్మికులతో నడుపుతున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తూత్తుకుడి జిల్లా విలాత్తికుళం నుంచి పెరిలోవన్‌పట్టి, చింతల్‌క్కరై మీదుగా కోవిల్‌పట్టికి వెళుతున్న నెం.78ఏ ప్రభుత్వ బస్సును తాత్కాలిక డ్రైవర్ సుబ్రమణియన్ నడుపుతున్నాడు. సాధారణంగా ఆ బస్సులో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. బుధవారం బస్సులో సుమారు 50 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. బస్సు సింగిలిపట్టి సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఒరిగింది. సుమారు 30మంది విద్యార్థులు ముందు సీట్లకు తగడలంతో స్వల్పగాయాలయ్యాయి. చుట్టుపక్క వారు విద్యార్థులను రక్షించి పారిలోవన్‌పట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బస్సు పక్కన చిక్కిన బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుపైకి చేర్చి విలాత్తికుళం బస్ డిపోకు తరలించారు.

పశువుల యజమానులకు రూ.70 వేల జరిమానా

ఐసిఎఫ్, జనవరి 10: రహదారులపై పశువులు వదిలిన యజమానులకు తాంబరం కార్పొరేషన్ రూ.70 వేల జరిమానా విధించింది. వాహన రాకపోకలకు అంతరాయం కలిగించేలా రోడ్లపై సంచరించే పశువులను బంధించి సంరక్షకులకు రూ.2 వేలు జరిమానా విధిస్తున్నారు. ఈనెల 1 నుంచి 7వ తేది వరకు 35 పశువులు బంధించి రూ.70 వేలు జరిమానా వసూలు చేసినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

గుట్కా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఐసిఎఫ్, జనవరి 10: నగరంలో గుట్కా విక్రయించిన ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, 9 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కొడుంగైయూర్ ప్రాంతంలో కొందరు గుట్కా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. జంబులినగర్‌లో మంగళవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి కిలో గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... రెడ్‌హిల్స్ గాంధీ నగర్‌కు చెందిన కార్తీక్ (32) అని, అదే ప్రాంతానికి చెందిన పురుషోత్తమన్ (54) నుంచి గుట్కా కొనుగోలు చేసినట్లు విచారణలో తెలిసింది. దీంతో పోలీసులు పురుషోత్తమన్ ఇంట్లో తనిఖీలు చేపట్టి 8 కిలోల గుట్కా స్వాధీనం చేసుకొని అతనిని అరెస్ట్ చేశారు.

తరగతి గదిలో ఉపాధ్యాయుడి మృతి

ఐసిఎఫ్, జనవరి 10: తరగతి గదిలో పాఠాలు బోధిస్తుండగా స్పృహ తప్పి పడిపోయిన ఉపాధ్యాయుడు మృతిచెందాడు. మదురై జిల్లా కన్ననేందల్ పసుపతి నగర్‌కు చెందిన జయశీలన్ (54) ముండకత్తాన్ ప్రాంతంలో ఉన్న క్రిస్టియన్ మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. మంగళవారం తరగతిలో పాఠాలు చెబుతున్న ఆయన హఠాత్తుగా గుండెపోటు రావడంతో కిందపడిపోయారు. సహ ఉపాధ్యాయులు చికిత్స కోసం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సమోసా తిన్న విద్యార్థిని మృతి

ఐసిఎఫ్, జనవరి 10: చెంగల్పట్టు సమీపంలో సమోసా తిన్న విద్యార్థిని మృతి చెందింది. చెంగల్పటు జిల్లా పటాలం ఎల్ఎస్‌పురానికి చెందిన పూజ(17) ప్రైవేటు కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతోంది. మంగళవారం యథావిధిగా కళాశాలకు వచ్చిన ఆమె క్యాంటీన్‌లో సమోసా తిని వాంతులు చేసుకుంటూ స్పృహ కోల్పోయింది. సహచర విద్యార్థులు, ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక మృతి చెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మిద్దె నుంచి దూకి యువతి ఆత్మహత్య

ఐసిఎఫ్, జనవరి 10: ప్రేమ వ్యవహారంలో విరక్తి చెందిన యువతి మిద్దె నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పెరంబూర్ భారతివీధికి చెందిన కృష్ణకుమారి(18) తల్లి, చెల్లెలతో కలసి నివసిస్తోంది. ఆమె ప్యారీస్‌లోని కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె కొళత్తూర్ జీకేఎం కాలనీకి చెందిన రికీ అనే యువకుడిని ప్రేమించింది. వీరిద్దరి మధ్య ఏర్పడిన సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన కృష్ణకుమారి, ఈనెల 2వ తేది రాత్రి 10 గంటలకు తన ఇంటి రెండో అంతస్తు నుంచి దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక మంగళవారం రాత్రి మరణించింది. సెంబియం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నలుగురు వ్యభిచార మధ్యవర్తుల అరెస్టు

అడయార్, జనవరి 10: నగరంలో నలుగురు వ్యభిచార బ్రోకర్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి వ్యభిచార వృత్తిలో ఉన్న ఇద్దరు యువతులను రక్షించి ప్రభుత్వం మహిళల సంరక్షణా కేంద్రానికి తరలించారు. మన్నడి, పుళల్ ప్రాంతాల్లో వ్యభిచారం సాగుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు మఫ్టీలో ఆయా ప్రాంతాల్లో నిఘా వేసి, మన్నడిలో వ్యభిచారం చేయించే సేలం జిల్లా అమ్మాపేట, మారియమ్మాళ్ వీధికి చెందన మోహన్ (39) అనే మధ్యవర్తిని అరెస్టు చేశారు. అతనివద్ద జరిపిన విచారణలో తంజావూరు జిల్లాకు చెందిన రమేష్ (49), ఈరోడ్ జిల్లాకు చెందిన మణిమారన్‌ను అరెస్టు చేశారు. అదేవిధంగా, పుళల్ సూరాపట్టు శివప్రకాశం మొదటి మెయిన్ రోడ్డులోని హౌసింగ్ బోర్డు ఇంట్లో అస్సోంకు చెందిన యువతితో వ్యభిచారం చేయిస్తున్న యువతిని పోలీసులు రక్షించి, భవానీ (38) అనే మధ్యవర్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మధ్యవర్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



చెరకు నరికే పనుల్లో మహిళలు

రైతుల కాయకష్టం...

బెల్లం తయారీ వెనుక రైతుల కాయకష్టం దాగి ఉంది. రైతులు పండించే చెరకుతోనే బెల్లం తయారవుతుంది. చక్కెర ఫ్యాక్టరీలు రాకమునుపు గ్రామీణ ప్రాంతాల్లో చెరకు గడలతోనే నాటు పద్ధతిలో బెల్లం తయారు చేసేవారు. ప్రస్తుతం దేశంలో పండించే చెరకు ఉత్పత్తిలో అరవై శాతం తెల్లటి చక్కెరగా మారుతుంటే మిగతా నలభైశాతం బెల్లంగా మారుతోంది. బెల్లంతో తయారైన వంటకాలు, బెల్లంతో తయారైన పానకాలు సేవించడం భారతీయుల సంస్కృతిలో భాగంగా ఉండేంది. వేసవిలో చల్లటి బెల్లపు పానకాలను చలివేంద్రాల్లో పంపిణీ చేసేవారు. ఇవన్నీ పాతచింతకాయపచ్చడి కబుర్లంటూ నేటి తరం కొట్టిపడేయవచ్చు. కానీ రాష్ట్రంలో ఇంకా చెరకును పండిస్తూ, వాటితో బెల్లం తయారు చేస్తున్న కర్షకజీవులెంతోమంది ఉన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.




చెరకు రసంతో పాకం తయారు చేస్తున్న రైతు - పాకాన్ని చల్లారుస్తున్న రైతు

సంక్రాంతి స్పెషల్...

ముమ్మరంగా బెల్లం తయారీ పనులు



బెల్లం ఉండలను ఆరబెడుతున్న మహిళలు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలంతా తొలి యేడాది మొదటి పెద్దపండుగ సంక్రాంతి (తై పొంగల్)ని జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతికి ముందు రోజు భోగి, మరుసటి రోజు కనుమ పండుగను జరుపుకుంటారు. రైతులకు ఆనందాన్నిచ్చేదీ ఈ పెద్ద పండుగే. పండించిన పంటలు కోతకు వచ్చే మాసంలో వచ్చేది ఈ పండుగ కనుక రైతుల చేతుల్లో డబ్బుకు కొదవ ఉండదు. యేడాదిపొడవునా వివిధ రకాల పంటలు పండించి కష్టపడి సాధించిన సంపదలో కొంత భాగాన్ని కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాతలు ఉత్సాహంగా పెద్ద పండుగను జరుపుకుంటారు. సంక్రాంతి అంటేనే తీయటి పొంగల్, పిండివంటకాలు గుర్తుకువస్తాయి. ముఖ్యమంగా బెల్లంతో తయారు చేసిన పొంగలిని సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. పశువుల పండుగకు బెల్లంతో తయారైన కుడుమలనే ఎక్కువగా చేస్తారు.

జోరుగా తయారీ పనులు...

తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లో పలు గ్రామాల్లో సంక్రాంతి వచ్చిందంటే చాలు చెరకు రైతులు నాణ్యమైన బెల్లం తయారీలో పోటీపడుతుంటారు. ఆ కోవలోనే తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట సమీపం ఆనందవల్లిపురంలో ప్రస్తుతం బెల్లం తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెరకు అంటేనే తీపి, ఇక బెల్లం అంటే మరీ తీపి కదా. ఆ తీపి బెల్లంను అక్కడి చెరకు రైతులు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ విషయమై అక్కడి చెరకు రైతు ఎం.తులసీరామన్(40) మాట్లాడుతూ... జిల్లాలో సుమారు మూడు వేల ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారని తెలిపారు. కిలో చెరకు ధరను ప్రభుత్వం రూ.75గా నిర్ణయిస్తే మధ్యదళారీలు తమ వద్ద రూ.40లకు కొనుగోలు చేస్తుంటారని, దీనితో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు.

కార్డుదారులకు బెల్లం పంపిణీ చేయాలి...

బెల్లం విక్రయాలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. యేటా సంక్రాంతి పండుగకు కార్డుదారులకు చక్కెరకు బదులు బెల్లం పంపిణీ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చెరకు సాగుపై పదివేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, యేటా పది నెలలు సాగు చేస్తుంటారని, చివరి రెండు నెలలు కోత, బెల్లం తయారీ పనులు జరుగుతుంటాయని చెబుతున్నారు. రాష్ట్ర చెరకు రైతుల సంఘం కోశాధికారి సి.పెరుమాళ్ మాట్లాడుతూ పొంగల్ కానుకలలో చక్కెర పంపిణీ చేసినా ముప్పావు శాతం ప్రజలు బెల్లంతోనే తీపి పొంగలిని తయారు చేస్తుంటారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బెల్లం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తే చెరకు రైతుల లబ్ధి పొందగలరని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇళ్లలోనే కుటీర పరిశ్రమలా బెల్లం తయారీ పనులు చేస్తుంటారని, గృహిణులకు బెల్లం పాకం తీయడం కూడా వచ్చునని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పొంగల్ కానుకలలో చక్కెరకు బదులుగా నాటు బెల్లంను పంపిణీ చేస్తే చెరకు రైతులు సంక్రాంతిని మరింత ఘనంగా జరుపుకుని ఆనందిస్తారని ఆయన చెప్పారు. ఇకనైనా ఈ చెరకు రైతుల న్యాయమైన కోర్కెను ప్రభుత్వం ఆమోదిస్తుందని ఆశిద్దాం!



చెరకు గడలను లోడింగ్ చేస్తున్న కార్మికులు

చిన్నారులకు సంక్రాంతి స్పెషల్ ట్రీట్ 'అయలాన్'

● హాస్య నటుడు కరుణాకరన్



'అయలాన్'లో కరుణాకరన్

శివకార్తికేయన్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'అయలాన్' చిన్నారులకు సంక్రాంతి స్పెషల్ ట్రీట్‌గా ఉంటుందని ఆ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించిన హాస్య నటుడు కరుణాకరన్ అన్నారు. ఈనెల 12న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా కరుణాకరన్ మాట్లాడుతూ... "అయలాన్' మూవీ ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చిన్నారులకు స్పెషల్ ట్రీట్‌గా ఉంటుంది. ఈ చిత్ర దర్శకుడు రవికుమార్‌లో అసాధారణమైన సాంకేతిక నైపుణ్యాలతో పాటు వినూత్నమైన ఆలోచనలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టును ఎంతో శ్రద్ధతో తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టు పట్ల దర్శక హీరోల నిబద్ధత, అంకితభావం, అభిరుచులు ఈ చిత్ర విజయానికి నిస్సందేహంగా దారితీస్తుంది. ఇక సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం హైలెట్. హీరో శివకార్తికేయన్ అసాధారణమైన వ్యక్తి. ప్రతి సన్నివేశంలో లీనమై నటిస్తారు. తనతో కలిసి నటించే ప్రతి నటీనటులతో తన మనోభావాలను పంచుకుంటారు. ఇలాంటి లక్షణాలను సూపర్‌స్టార్ రజనీకాంత్‌లో గుర్తించా. 'తలైవర్' కూడా ప్రతి టేక్‌కు ముందు తన సహనటీనటులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుని, ఆ సన్నివేశం మరింత మెరుగ్గా వచ్చేందుకు శ్రద్ధ తీసుకుంటారు' అని కరుణాకరన్ అన్నారు. మరోవైపు కరుణాకరన్ అనేక చిత్రాల్లో నటిస్తూ కోలీవుడ్‌లో అత్యంత బిజీగా హాస్య నటుల్లో ఒకరు.

చిత్రజ్యోతి

కోలీవుడ్‌కు మరో యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ కౌషిక్ క్రిష్



తమిళ చిత్రపరిశ్రమకు మరో టాలెంటెడ్ యంగ్ సంగీత దర్శకుడు పరిచయమయ్యారు. పేరు కౌషిక్ క్రిష్. సంగీత దర్శకుడు హిప్ హాప్ ఆది సంగీత బృందంలో సౌండ్ ఇంజనీర్‌గా పని చేసిన క్రిష్... సంగీత దర్శకుడు కావాలన్న పట్టుదలతో మ్యూజిక్‌లో శిక్షణ పొందారు. ఈ క్రమంలో ఆయన 'తనీ ఒరువన్' చిత్రంలో 'కణ్ణాల కణ్ణాల' పాటను పాడి నేపథ్య సంగీత గాయకుడిగా పరిచయమయ్యారు. ఈ పాట హిట్ కావడంతో గుర్తింపు పొందాడు. ఆ తర్వాత అనేక చిత్రాల్లోని పాటకు గాత్రదానం చేశాడు. అరుళ్‌నిధి నటించిన 'డీ బ్లాక్' చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ సంగీతాన్ని సమకూర్చారు. ఇటీవల విడుదలైన 'ఓడవుం ముడియాదు ఒలియవుం ముడియాదు' అనే చిత్రం ద్వారా పూర్తిస్థాయి సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రం సంగీతంతో పాటు కథా నేపథ్యం బాగుండటంతో ప్రేక్షకులు ఆదిస్తున్నారు. ప్రస్తుతం క్రిష్.. ఓ ఫాంటసీ మూవీకి సంగీతం సమకూర్చుతున్నారు.

షణ్ముగ పాండ్యన్ చిత్రంలో నటించేందుకు సిద్ధం



రాఘవ లారెన్స్ - షణ్ముగ పాండ్యన్

● రాఘవ లారెన్స్

తమిళ చిత్రపరిశ్రమలో ఎంతో మందికి లైఫ్ ఇచ్చిన కెప్టెన్ వియకాంత్ కుటుంబానికి ఏదో ఒక సాయం చేయాలని ఉందని, ఇందుకోసం షణ్ముగ పాండ్యన్ నటించే చిత్రంలో అతిథి పాత్రను పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు దర్శక, హీరో రాఘవ లారెన్స్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన బుధవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ఇటీవల సాలిగ్రామంలోని కెప్టెన్ నివాసానికి వెళ్లి విజయకాంత్ చిత్రపటానికి నివాళి అర్పించాం. ఆయన భౌతికంగా లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం. ఆ రోజున విజయకాంత్ కుటుంబ సభ్యులందరితో మాట్లాడాం. ఓదార్పు తెలిపాం. అపుడు ప్రేమలత సోదరి ఒక మాట అన్నారు. కెప్టెన్ పిల్లలను ఇక మీరే చూసుకోవాలి. సాయం చేయాలి అన్నారు. ఈ మాట నన్ను ఎంతగానో కలచివేసింది. చిత్రపరిశ్రమంలో ఎంతో మందికి అవకాశాలతో పాటు కొత్త జీవితాన్ని ప్రసాదించిన కెప్టెన్ పిల్లలకు ఏంటి ఈ పరిస్థితి అనే బాధ నాలో ఏర్పడింది. అందుకే నా వంతుగా ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నా. షణ్ముగ పాండ్యన్ నటిస్తున్న చిత్రంలో దర్శక నిర్మాతలు కోరితే చిన్న పాత్ర చేసేందుకు, ఈ సినిమా విడుదల సమయంలో ప్రచారం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు సిద్ధం. అలాగే ఎవరివద్దనైనా మల్టీస్టారర్ స్టోరీ ఉంటే షణ్ముగ పాండ్యన్‌తో కలిసి నటించేందుకు సిద్ధంగా ఉన్నా. ఇక రాజకీయాల్లో ఉన్న విజయ ప్రభాకరన్‌కు ఆ రంగంలో రాణించాలని కోరుకుంటున్నా' అని రాఘవ లారెన్స్ పేర్కొన్నారు.

ఆ హీరో సరసన నటించాలన్నదే

నా జీవితాశయం



● దేవయాని శర్మ

తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటించిన ఢిల్లీ భామ దేవయాని శర్మ.. కోలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు తహతహలాడుతున్నారు. ముఖ్యంగా కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ శింబు అలియాస్ టీఆర్ సిలంబరసన్ సరసన నటించాలని తెగ ఆరాటపడుతున్నారు. తన జీవితాశయం కూడా శింబు సరసన నటించడమేనని అంటున్నారు. 2021లో 'రొమాంటిక్' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన దేవయాని శర్మ... పలు రకాల నృత్యాల్లో శిక్షణ పూర్తి చేశారు. తన తమిళ సినీ రంగ ఎంట్రీపై ఆమె స్పందిస్తూ, 'తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటించినప్పటికీ.. తమిళంలో నటించాలన్న కోరిక బలంగా ఉంది. ముఖ్యంగా శింబు సరసన నటించాలన్నదే నా జీవితాశయం. కేవలం హీరోయిన్‌గానే కాకుండా, ప్రేక్షకులను మెప్పించే అన్ని రకాల పాత్రలు చేసే నటిగా గుర్తింపు పొందాలి. కీర్తి సురేష్, సాయిపల్లవి నాకు ఎంతో ఇష్టమైన హీరోయిన్లు. వీరే నాకు ఆదర్శం. శింబు సరసన నటించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. ఇందుకోసం ముమ్మరంగా నా వంతు కృషి చేస్తున్నా' అని దేవయాని శర్మ పేర్కొన్నారు.



రామేశ్వరం తీరంలో నిలిపి ఉంచిన పడవలు

రామేశ్వరంలో భారీ వర్షం

● చేపలవేటకు వెళ్లని జాలర్లు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం వేకువజాము వరకు భారీగా వర్షాలు కురిశాయి. వర్షాల వల్ల రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడ్డారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం, తంగచ్చిమఠం, పాంబన్, మండపం తదితర ప్రాంతాల్లో మంగళవారం వేకువజామునుంచి బుధవారం ఉదయం వరకూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. రామేశ్వరంలో పెనుగాలులతో భారీగా వర్షం కురిసింది. రామేశ్వరం రామనాథస్వామి ఆలయ ప్రాంతం, మునియసామి గుడి వీధి, మార్కెట్, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో రహదారులపై మోకాలి లోతున నీరు ప్రవహించింది. దీంతో వాహనాలు నత్తనడక నడిచాయి. బుధవారం ఉదయం రామేశ్వరం తీరంలో గంటకు 40 నుంచి 55 కి.మీల వేగంతో పెనుగాలులు వీయడంతో జాలర్లు చేపల వేట వెళ్లకూడదంటూ జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో రామేశ్వరం, పాంబన్, మండపం, కీళ్‌కరై, వాలినోక్కం, మక్రయూరు, దేవీపట్టినం, చోళియంకుడి, తొండి తదితర రేవులలో 1600కు పైగా మరపడవలు, 6 వేలకు పైగా నాటుపడవలను తీరం వద్దే లంగే రేసి ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు కడలాడిలో 41 మి.మీ.లు, వాలినోక్కంలో 53 మి.మీ.లు, కముదిలో 53 మి.మీ.లు, పల్లమోర్‌కుళంలో 12 మి.మీ.లు, ముదుగళత్తూరులో 25 మి.మీ.లు, పరమకుడిలో 28మి.మీ.లు, ఆర్‌ఎస్ మంగళంలో 21మి.మీ.లు, మండపంలో 45 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

వైగై డ్యాం నుంచి అదనపు జలాల విడుదల

● ఐదు జిల్లాలకు వరద హెచ్చరిక



వైగై జలాశయం నుంచి విడుదలవుతున్న అదనపు జలాలు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని వైగై జలాశయం నుంచి సెకనుకు ఐదువేల ఘనపుటడుగులకు మించి జలాలను విడుదల చేస్తుండటంతో ఐదు జిల్లాలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈ జలాశయం నుంచి తేని, మదురై సహా ఐదు జిల్లాలకు సాగునీటిని, మదురై నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా తేని పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వైగై జలాశయం నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఆ జలాశయం నీటి పరివాహక ప్రాంతాలైన వరుసనాడు, వెళ్లిమలై, కండమనూరు, అరసడి తదితర గ్రామాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో వైగై జలాశయంలోకి నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఆ జలాశయంలో 72 అడుగుల దాకా నీటిని నిల్వ చేయడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం జలాశయంలో 71 అడుగులకు నీటిమట్టం పెరిగింది. దీంతో డ్యామ్‌లోకి ప్రవేశిస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నారు. దీంతో తేని, దిండుగల్, మదురై, శివగంగ, రామనాథపురం జిల్లాలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. వైగై జలాశయం సాగునీటి కాల్వలో స్నానాలను నిషేధించారు. వైగై జలాశయం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కూడా అధికారులు హెచ్చరించారు.

పొంగలో.... పొంగల్

● కోలాహలంగా వీఐటీ వర్శిటీలో సంక్రాంతి సంబరాలు




పొంగల్ వేడుకల్లో వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ - వేడుకల్లో సంప్రదాయ నృత్యాలు

వేలూరు, జనవరి 10: స్థానిక కాట్పాడిలోని వీఐటీ యూనివర్శిటీలో బుధవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. కార్యక్రమానికి వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు శంకర్, సెల్వం పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులు రంగవల్లికలు వేసి, పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి గ్రామీణ కళారూపాలు ప్రదర్శించారు. గానా వేల్‌మురుగన్ జానపద గేయాలు ఆలపించగా, విద్యార్థినీ, విద్యార్థులు ఆ పాటలకనుగుణంగా నృత్యం చేశారు. సంబరాలు జరిగే ప్రాంగణాన్ని గ్రామీణ వాతావరణంగా తీర్చిదిద్దారు.

వేడుకగా ఎస్‌కేపీసీలో సంక్రాంతి సంబరాలు





ఎద్దుల బండిపై కేరింతలు కొడుతున్న విద్యార్థినులు - పొంగలి వండుతున్న విద్యార్థినులు - భోగి మంటలు

● సినీ తారల సందడి

ప్యారీస్, జనవరి 10: స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో సంక్రాంతి పండుగను ఆహ్వానం పలుకుతూ బుధవారం సమైక్య సంక్రాంతి సంబరాలను కోలాహలంగా జరుపుకున్నారు. కళాశాల ప్రాంగణాన్ని గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా అందంగా తీర్చిదిద్దారు. కరస్పాండెంట్ ఊటూకూరు శరత్‌కుమార్ సారథ్యంలో వర్ధమాన నటీనటులు రియోరాజ్, భావ్యశ్రీ ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థినులతో కలసి సందడి చేశారు. అధ్యాపకులు, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి మంటలు, పొంగళ్లు పొంగించడం, ఉట్టి కొట్టడం, రంగవల్లుల పోటీలు, సంప్రదాయ క్రీడలు, జానపద నృత్యాలు, ఉయ్యాల ఊగడం, ఎడ్లబండిపై విహరించి అలరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ మాట్లాడుతూ... విద్యార్థినులకు పండుగల విశిష్టత తెలియజేయడమే లక్ష్యంగా యేటా సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు.

బాలలోక్ పాఠశాలలో పొంగల్ సందడి



'సై అంటే సై'



వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు

ప్యారీస్, జనవరి 10: స్థానిక విరుగంబాక్కంలోని బాలలోక్ పాఠశాలలో బుధవారం పొంగల్ పండుగను ఆహ్వానిస్తూ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు వివిధ వేషధారణ, సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. సంప్రదాయ కళలు ప్రోత్సహించే విధంగా విద్యార్థులు నెమలాట్టం, గరగాట్టం, కోలాటం, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే, ఉపాధ్యాయులు సైతం పిల్లలతో కలసి ఆడుతూ పాడుతూ సందడి చేశారు.



సంప్రదాయ వస్త్రధారణతో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రేపు ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం

పెరంబూర్, జనవరి 10: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్ 48వ ట్రేడ్ ఫెయిర్ ఈనెల 12న శుక్రవారం ప్రారంభమవుతుందని పర్యాటక శాఖ తెలియజేసింది. ఈ ఫెయిర్‌ను ఆ రోజు సాయంత్రం 5 గంటలకు మంత్రి ఉదయనిధి ప్రారంభించనున్నారు. ఈ ట్రేడ్ ఫెయిర్‌ను వీక్షించేందుకు వచ్చే పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.25 ప్రవేశ రుసుముగా నిర్ణయించామని, ఐదేళ్లలోపు పిల్లలకు ప్రవేశరుసుము లేదని తెలిపారు. అలాగే, ఈ నెల 12, 13 తేదీల్లో ఈ ప్రాంగణంలో 'తమిళ్ సంగమం' పేరుతో నిర్వహించే ప్రదర్శనలను ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చని అధికారులు తెలిపారు.

అధికారపూర్వక 'ఎక్స్' ప్రారంభించిన టీఎన్‌పీఎస్సీ

పెరంబూర్, జనవరి 10: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) అధికార పూర్వక 'ఎక్స్' ఖాతా ప్రారంభించింది. టీఎన్‌పీఎస్సీ వెలువరించే అన్ని పరీక్షల నోటిఫికేషన్లు, పరీక్షా ఫలితాలు, నియామకాలకు సంబంధించి ఈ ఎక్స్‌లో పోస్ట్ చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది.

ఐటీ, వాణిజ్య సంస్థల నిర్వహణకు 'డెక్సియాన్' మెరుగైన మార్గాలు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐటీ, తదితర కార్యాలయాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరిస్తూ అనువైన సిబ్బందిని భర్తీ చేసేలా సేవలందిస్తున్న డిసియస్ సంస్థ డెక్సియాన్ అంటూ రీబ్రాండ్‌గా తన సేవలను విస్తరింపజేస్తోందని ఆ సంస్థ సీఈఓ మరుఫ్ అహమ్మద్ తెలిపారు. నగరంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆధునిక వ్యాపారాలకు కొత్త పని విధానాలను, వాణిజ్య నిర్వహణకు మెరుగైన మార్గాలను అందించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. డెక్సియాన్ ఇండియా హెడ్ కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ... చెన్నై, బెంగళూరు, నోయిడా, పుణె, ముంబై సహా ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థకు 70 శాఖలు ఉన్నాయని, 12 వేలమందికి పైగా ఉద్యోగులు సేవలందిస్తున్నారని వివరించారు.



డెక్సియాన్ సేవల గురించి వివరిస్తున్న ఆ సంస్థ నిర్వాహకులు మరుఫ్ అహ్మద్, కుమార్ రాజగోపాలన్

జల్లికట్టు సమస్యకు పరిష్కారం చూపింది ప్రధాని మోదీయే

● మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్

పెరంబూర్, జనవరి 10: జల్లికట్టు పోటీల నిర్వహణలో సమస్యలు పరిష్కరించింది ప్రధాని నరేంద్రమోదీ అని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. తిరుచ్చిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తనకు తానుగా ఎడప్పాడి పళనిస్వామి రాజీనామా చేయాలని, లేని పక్షంలో కోటిన్నర మంది కార్యకర్తలు ఆ పని చేసి చూపుతారన్నారు. అన్నాడీఎంకేలో అన్ని వర్గాలు కలిస్తేనే రాబోయే పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో గెలిచేందుకు అవకాశముంటుందన్నారు. మూడు నెలల్లో కొడనాడు హత్య, దోపిడీ వ్యవహారాన్ని ఛేదిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించి రెండున్నరేళ్ల దాటినా ఇప్పటికీ చర్యలు చేపట్టలేదన్నారు. ప్రపంచంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కూటమితో వ్యవహరించడం తమిళనాడులో మాత్రమే కనిపిస్తోందని పన్నీర్‌సెల్వం విమర్శించారు.



చెన్నై సచివాలయంలో క్రీడాశాఖ మంత్రి ఉదయనిధిని కలుసుకుని తుఫాను బాధితుల సహాయార్థం కాంగ్రెస్ శాసనసభ్యుల తరపున రూ.18లక్షల విరాళాన్ని అందజేస్తున్న సీఎల్పీ నేత సెల్వపెరుంతగై తదితరులు